# విశాల భారతి

తెలుగు దిన పత్రిక


epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 21.05.2025 | 24 క్యారెట్లు 84,215.00 | కిలో వెండి 1,07,650.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:200

www.vishalabharati.com


## భారత సాయుధ దళాలు నైపుణ్య సర్జన్లు

- భారత్ ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టింది
- రోగులకు వైద్యులు చికిత్స చేస్తారు
- మేం ఉగ్రవాదానికి చేస్తున్నాం
- కేఎన్ మెమోరియల్ హాస్పిటల్ 25వ వార్షికోత్సవంలో
- రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్



విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సాయుధ దళాలు నైపుణ్యం కలిగిన సర్జన్లలా కచ్చితత్వంతో పనిచేశాయని రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ తెలిపారు. సరిహద్దు వెంబడి ఉగ్రవాద మూలాలను కచ్చితత్వం, క్రమశిక్షణతో లక్ష్యంగా చేసుకున్నాయని చెప్పారు. ఈ మేరకు లఖ్నవూలోని కేఎన్ మెమోరియల్ హాస్పిటల్ 25వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ ఓటమిని అంగీకరించలేదు. భారత గడ్డపై

..మిగతా 2 లో



11 ఏళ్లలో

## 151 విదేశీ పర్యటనలు

- ప్రధాని మోదీ విదేశాంగ విధానంపై ఖర్గే విమర్శలు
- ప్రధాని పర్యటనలు దేశానికి అర్థవంతమైన ఫలితాలను ఇచ్చాయా
- దౌత్య విజయాల కంటే ఫోటోపైకే మోదీ ఎక్కువగా దృష్టి
- విదేశాలను సందర్శించి ఫోటోలకు పోజులివ్వడమే ప్రధానమంత్రి పనేనా

విశాలభారతి, స్టేట్ బ్యూరో: భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. ఆయన తరచుగా చేస్తున్న అంతర్జాతీయ పర్యటనలపై మంగళవారం ప్రశ్నించారు. గత 11 ఏళ్లలో 72 దేశాల్లో మోదీ 151 విదేశీ పర్యటనలు చేసినప్పటికీ, ప్రపంచ వేదికపై భారత్ ఒంటరిగా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. ప్రధాని పర్యటనలు దేశానికి అర్థవంతమైన ఫలితాలను ఇచ్చాయా? అని ప్రశ్నించారు. దౌత్య విజయాల కంటే ఫోటో అవకాశాలపైనే మోదీ ఎక్కువగా దృష్టి సారించారని ఆరోపణలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. గత 11 సంవత్సరాలుగా ప్రధాని మోదీ తరచుగా విదేశీ పర్యటనలు చేస్తున్నారు. కానీ మన భారతదేశం

..మిగతా 2 లో

## భూ సమస్యలు పరిష్కరిస్తాం



- దేశానికి రోల్ మోడల్ భూ భారతి
- న్యాయపరమైన సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- భూమి రిజిస్ట్రేషన్ లోనే మ్యాప్‌ను పాస్ పుస్తకంలో అప్‌లోడ్ చేస్తాం
- మ్యాప్ వల్ల భావి తరాలకు ఇబ్బందులు ఉండవు
- 6వేల మంది సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నాం
- జూన్ 2నుంచి తహసీల్దార్ గ్రామాలకు వస్తారు
- ప్రతీ భూమికి భూధార్ నంబర్ వస్తుంది
- రెవెన్యూ సదస్సుల ద్వారా 1600 దరఖాస్తులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మంత్రి పొన్నం ప్రభాకర్

*రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి అమలుకు సైదాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 1600 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. న్యాయపరమైన సమస్యలన్నీ భూభారతి ద్వారా అధికారులు త్వరలోనే పరిష్కరిస్తారన్నారు.*

సైదాపూర్, విశాలభారతి: ధరణిలో చిన్నచిన్న పొరపాట్లను కూడా సవరించే అవకాశం ఉండకపోయేదన్నారు. భూ భారతిలో భూమి రిజిస్ట్రేషన్ చేసే సందర్భంలోనే సర్వే చేయించి ఆ మ్యాప్‌ను పాస్ పుస్తకంలో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. ఈ మ్యాప్ వల్ల భావి తరాలకు ఇబ్బందులు ఉండబోవన్నారు. ఆరువేల మంది సర్వేయర్లకు మూడు నెలలపాటు శిక్షణనిస్తున్నామని తెలిపారు. మండలానికి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లు పని చేస్తారన్నారు. ఈ నెల 27 నుంచి సర్వేయర్లకు శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 2 నుంచి

..మిగతా 2 లో



## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో రన్యారావుకు బెయిల్

- షరతులతో బెయిల్ మంజూరు చేసిన బెంగళూరు కోర్టు
- 2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తు
- మార్చి 3న బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావు అరెస్ట్
- తదుపరి విచారణ జూన్ 3కి వాయిదా

3 లో

## మాజీ అణుశాస్త్రవేత్త ఎంఆర్ శ్రీనివాసన్ కన్నుమూత

- శ్రీనివాసన్ మృతి పట్ల ప్రభుత్వం నివాళి
- ఉదగమండళం జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు పుష్పాంజలి
- బెంగుళూరులో జనవరి 5, 1930లో జననం
- 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ

3 లో

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రజలకు తెలుపుతున్నాం

- గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు
- పేదలకు పాదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు
- ప్రతిపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తున్నారు
- కార్యకర్తల అందరి కృషితో తెలంగాణలో ప్రభుత్వం వచ్చింది
- ప్రభుత్వం ఇచ్చిన మాట అమలుచేస్తుంది
- వేములవాడ నియోజకవర్గ బ్లాక్‌కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో
- మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రం లోని ఆర్థిక వ్యవస్థ ప్రతి పౌరుడు తెలుసుకునేలా చేశా మని బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని స్థానిక మహాలింగేశ్వర

..మిగతా 2 లో




## అంబేద్కర్ విగ్రహం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి వివక్ష

- అందాల పోటీదార్లకు అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు చూపించలేదు
- అమరజ్యోతి వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీ వినోద్‌కుమార్

2 లో




## ప్రైవేటు ఫీజుల దోపిడీ

### ఆర్భాటపు ప్రకటనలతో తల్లిదండ్రులకు ఎర

- పుస్తకాలు, యూనిఫాం పేరిట అధిక వసూలు
- ఒకటి నుంచి ఐదోతరగతి వరకు సొంత సిలబస్ అమలు
- విద్యార్థుల తల్లిదండ్రులపై తప్పని భారం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

విశాలభారతి,హైదరాబాద్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు చేపడుతున్నాయి. పరిమిత సీట్లు అంటూ బోర్డులు పెట్టి.. ఆర్భాటపు ప్రకటనల తో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆక ర్షిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, క్రీడా మైదానాలు లేకపోయినా నిర్వాహకులు ఫీజుల మోత మోగిస్తున్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు,

..మిగతా 2 లో

## కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు

- మాజీ మంత్రులు హరీష్ రావు , ఈటల రాజేందర్‌కు కూడా
- జూన్ 5 లోపు కమిషన్ ఎదుట హాజరుకావాలి
- జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా నోటీసులు
- ఏడాది పాటు సుదీర్ఘంగా విచారణ జరిపిన పీసీ ఘోష్
- బ్యారేజీ నిర్మాణంలోని ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులందరినీ విచారించిన కమిటీ
- రాజకీయ కక్షే అంటున్నా కవిత



విశాలభారతి, స్టేట్ బ్యూరో; మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు పంపింది. జూన్ 5 లోపు కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు , ఈటల రాజేందర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరం నిర్మాణం వ్యవహారంలో నిజాన్ని నిగ్గు తేల్చాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ అధ్యక్షతన

..మిగతా 2 లో

## 7 నెలల్లో 25 మందితో పెండ్లి

- ఇంట్లో వాళ్లకు ఆహారంలో మత్తు ఇచ్చి విలువైన వస్తువులతో ఉడాయింపు
- పేదింటి పిల్లను.. నిస్సహాయురాలిని అంటూ వల
- నమ్మించి మోసం చేయడంలో ఆమె ఎక్స్‌పర్ట్
- వరుడిగా అవతారమెత్తి నిత్య పెళ్లి కూతురి ఆటకట్టించిన పోలీస్.

2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం, 21.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## అంబేద్కర్ విగ్రహం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి వివక్ష

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న వారికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పునర్నిర్మించిన యాదగిరిగుట్ట, కొత్తగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ భవనం, సెక్రటేరియట్‌తోపాటు రామోజీ ఫిల్మ్‌సిటీ, చౌమొహల్లా ప్యాలెస్, చార్మినార్, రామప్ప దేవాలయం తదితర కట్టడాలను చూపిస్తున్నారు తప్ప ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా కేసీఆరే నిర్మించిన.. 125 అడుగుల బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు చూపించడం లేదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వివక్ష చూపుతున్నారని, ఇది దేనికి సంకేతమని నిలదీశారు. తెలంగాణ భావన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన ఎందరో బలిదానాలకు గుర్తుగా కేసీఆర్ నిర్మించిన అమరజ్యోతి రాష్ట్రానికే గర్వకారణమని, అలాంటి అమరజ్యోతిని సందర్శించడానికి అందాల పోటీదారులను ఎందుకు తీసుకెళ్లడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ నెల 31తో అందాల పోటీలు ముగుస్తాయని, ఆ తర్వాత.. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున వారిని రాష్ట్ర గవర్నర్‌ను కలువడానికి తీసుకెళ్లడం సంతోషమే అని పేర్కొన్నారు. అయితే ఈలోగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి.. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని, వారి జీవిత చరిత్రను.. ఆ పక్కనే ఉన్న అమరజ్యోతిని సందర్శింపజేసి, వాటి ప్రతిష్ఠ, ప్రాధాన్యతల గురించి అందాల పోటీదారులకు సమగ్రంగా వివరించాలని సూచించారు.

# భారత సాయుధ దళాలు నైపుణ్య సర్జన్లు

తరువాయి భాగం

ప్రతీకార దాడులకు ప్రయత్నించింది. పౌరులను, ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలను లక్ష్యంగా చేసుకుంది. కానీ మన దళాలు తగిన సమాధానం ఇచ్చాయి. దాడుల సమయంలో భారత్ ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టింది. పౌర ప్రాంతాలకు ఎటువంటి హాని జరగకుండా చూసుకోవడానికి జాగ్రత్తలు తీసుకుంది. నేరస్థులను శిక్షించేటప్పుడు, అమాయకుల ప్రాణాలకు ఎటువంటి హాని జరగకుండా మన సైనికులు చూసుకున్నారు" అని రాజ్నాథ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయం దానికి నిదర్శనం

గత నెలలో ఈ కార్యక్రమానికి ఆహ్వానాన్ని అంగీకరించినప్పుడు, ఇటీవల నెలకొన్న ఉద్రిక్తతల పరిస్థితి కారణంగా తాను హాజరు కాగలనా లేదా అని అనుకున్నట్లు రాజ్నాథ్ తెలిపారు. కానీ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగిసిన తర్వాత సాయుధ దళాలకు, ప్రజల స్ఫూర్తికి కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చానని తెలిపారు. "మీరు (వైద్యులు) రోగులకు చికిత్స చేస్తారు, కానీ మేం రక్షణ మంత్రిత్వ శాఖలో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, ఉగ్రవాదం అనే వ్యాధికి నిర్మూలన చేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ విజయం ఆ సంకల్పానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. "భారతదేశంలో 10 కోట్లకు పైగా ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు. 14 కోట్ల మంది ప్రజలు మధుమేహం అంచున ఉన్నారు. మన జీవనశైలిని నియంత్రించుకోవాల్సిన అవసరాన్ని మనం అర్థం చేసుకోవాలి. సమతుల్య జీవనశైలిని అవలంబించడం ద్వారా మనం పోరాడగల అనేక వ్యాధులు ఉన్నాయి. వైద్యులు ఆ పని చేయగలరు" అని రాజ్నాథ్ తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ మంచి జీవన శైలిని అవలంబించాలని చెప్పారు. ఆయుష్మాన్ పథకంతో 80 కోట్లకు మందికి పైగా ప్రయోజనం పొందారని రాజ్నాథ్ తెలిపారు. "ఆ పథకం కారణంగా ప్రజలు తమ జేబుల్లో నుంచి చికిత్స కోసం చేసే పెట్టే ఖర్చు నేడు 62 శాతం నుంచి 38 శాతానికి తగ్గింది. 2014కి ముందు, దేశంలో కేవలం 387 వైద్య కళాశాలలు ఉండేవి, 2024 నాటికి అవి 780కి పెరిగాయి. రాష్ట్రంలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అద్భుతమైన కృషి చేసింది" అంటూ రాజ్నాథ్ ప్రశంసించారు.

# 11 ఏళ్లలో 151 విదేశీ పర్యటనలు

తరువాయి భాగం

ఇప్పుడు ఒంటరిగా ఉంది. గత 11 సంవత్సరాల్లో ప్రధాన మంత్రి మోదీ 151 విదేశీ పర్యటనలు చేసి 72 దేశాలను సందర్శించారు. వీటిలో ఆయన 10 సార్లు అమెరికాను సందర్శించారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం వల్ల మన దేశం ఒంటరిగా నిలుస్తుంది. విదేశాలను సందర్శించి ఫోటోలకు పోజులివ్వడమే ప్రధాన మంత్రి పనినా?" అని ఖర్గే ఆరోపణలు చేస్తూ ప్రశ్నించారు. దాయాది దేశం పాకిస్థాన్కు అంతర్జాతీయ ద్రవ్యనిధి 1.4 బిలియన్ డాలర్ల రుణం ఇవ్వడం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు సమయంలో అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటించడం వంటి విషయాలను ప్రస్తావించారు మల్లికార్జున ఖర్గే. "పాక్కు ఐఎంఎఫ్ 1.4 బిలియన్ డాలర్ల రుణం అందించడం ద్వారా మద్దతు ఇచ్చింది. మన సైన్యం ఉగ్రవాదులపై కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వచ్చింది" అని ఆయన తన పోస్ట్లో పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహించారన్న వాదనలను మోదీ ప్రస్తావించలేదని విమర్శించారు. అది భారత విదేశాంగ విధానంలో స్పష్టత, పారదర్శకత లోపాన్ని సూచిస్తుందని వ్యాఖ్యానించారు. "భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు నేను మధ్యవర్తిత్వం వహించాను అని అమెరికా అధ్యక్షుడు ప్రకటించి మన దేశాన్ని దాదాపు 7 సార్లు అవమానించారు. ఉగ్రవాదులపై కఠిన చర్య తీసుకోవడంలో మొత్తం దేశం ఐక్యంగా ఉంది. కానీ ఇప్పటివరకు ట్రంప్ ప్రకటనల గురించి దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వకుండా మోదీ జీ ఈ సమస్యను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రజలకు తెలుపుతున్నాం

తరువాయి భాగం

గార్డెన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ బ్లాక్‌కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, కొంత ఇబ్బంది ఉన్న మాటను తెలంగాణ ప్రజలకు తెలియాలని వివరించామన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ స్థానిక సంస్థల్లో విజయం సాధించాలని తె లంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ కార్యక్రమా లను నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైతే గ్రామ కాంగ్రెస్ పార్టీని నడపగలుగుతారో వారినే గ్రామశాఖ అధ్యక్షుడి గా ఎన్నుకోవాలని, మండల అధ్యక్షులుగా సమష్టి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యకర్తల అందరి కృషితో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఇంటికి తీసుకుపోవాలని అన్ని ఎన్నికల్లో పార్టీ గెలిచేలా బాధ్యత కార్యకర్తలు తీసుకో వాలన్నారు. ప్రతి పథకం పేదవాడికి అందేలాగా చేస్తున్నామని, ఇందిరా సౌర, గిరి జల వికాసం పథకం సోమవారం ప్రారంభించామన్నారు. సోలార్ ద్వారా మోటార్ సిస్టబ్ అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల్లో పేదలకు పాదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తు న్నామని, ప్రతిదీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నా రని ప్రతిపక్షాలను విమర్శించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట అమలుచేస్తుందని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండలాలు గ్రామాల్లో పార్టీ పునఃనిర్మాణం జరగాలని, అనుబంధ సంఘాలు, యువజన సంఘాలు బలోపేతం కావాలని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల ను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందకు అహ ర్నిశలు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృ త స్థాయి సమావేశానికి హజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పో తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రా జన్న ఆలయ అభివృద్ధి విస్తరణచేస్తూ మందుకు పోతున్నామని, ప్రజా ప్రభు త్వంలో ఆలయ అభివృద్ధి, పట్టణ అభి వృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఆల య అభివృద్ధిలో భాగంగా స్వామి వారికి జరిగే సుప్రభాత సేవ నుంచి మొదలుకుని రాత్రి వరకు జరిగే అన్ని నిత్య పూజలు యాదావిధిగా జరుగు తాయని తెలిపారు. దేవాలయం మూ సివేత అనేది ఉండదని, ఏవాలయం తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయ ని, అభివృద్ధిలో భాగంగా మండపాన్ని విస్తరిస్తూ పను లు సాగిస్తామని, భక్తులకు ఆర్జిత సేవలు దూరం చేయ కుండా ఉండేందుకు శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు భీవేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు ఏ ర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి రూ.76 కోట్లతో విస్తరణ చేయాలని నిర్ణయించాలన్నారు. ప్రజలు చెప్పే ప్రతి విషయాన్ని వినడానికి సిద్ధంగా ఉన్నామని, ఎవరు చెప్పిన పాజిటివ్ కోణంలో తీసుకుని రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తర ణ ముందకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ, ఆయామండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరిస్తాం

తరువాయి భాగం

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇక రెవెన్యూ అధికారి చొప్పున విధులు నిర్వహించనున్నారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సరిహద్దు పంచాయతీలు కొలిక్కి వస్తాయన్నారు. ప్రతీ భూమికి భూధార్ నంబర్ వస్తుందని తెలిపారు.



జూన్ 2నుంచి తహసీల్దార్ గ్రామాలకు వస్తారని, భూ సమస్యల దరఖాస్తులు వారికి అందించాలని తెలిపారు. ఒక్క రూపాయి ఫీజు కూడా ఎవరికి చెల్లించాల్సిన పని లేదని, శాశ్వతంగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. దరఖాస్తు కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. 18 రాష్ట్రాల్లో ఆరు నెలల పాటు పర్యటించి మంచి అంశాలను క్రోడీకరించి భూ భారతి చట్టం రూపొందించామన్నారు. ప్రతీపేదవాడికి గూడు ఉండాలన్న ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, మొదటివిడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అప్పుల భారం ఉన్నప్పటికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అనంతరం భూభారతిలో భూసమస్యలు పరిష్కారం అయిన వారికి ప్రొసీడింగ్స్ అందజేశారు. సంతోషిమాత మండల సమైక్యకు బ్యాంకు లింకేజీ ద్వారా వచ్చిన 2.13 కోట్ల చెక్కును అందజేశారు. పీఎంఈజీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

**భూ సమస్యలు పరిష్కరిస్తాం**

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ధరణి స్థానంలో భూ భారతి తీసుకొస్తామని హామీ ఇచ్చిరని, ఇచ్చిన మాట ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి తెచ్చామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలో భూ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కారం చేస్తామన్నారు. చిగురుమామాడి, మానకొండూర్ కాలువ పనులు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, జిల్లా గ్రంథలాయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, సైదాపూర్, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్లు దొంత సుధాకర్, నిర్మల జయరాజ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు


తరువాయి భాగం

కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు ఏడాదిన్నరగా కమిషన్ విచారణ కొనసాగుతోంది. కమిషన్ విచారణ గడువు ఈ నెలాఖరితో ముగియనుంది. అయితే కమిషన్ గడువును ప్రభుత్వం మరో రెండు నెలల పాటు (జూలై 31) వరకు పొడిగిచింది. కమిషన్ విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులందరినీ కమిషన్ విచారించింది. వారి నుంచి అఫిడవిట్లరూపంలో వాంగ్మూలాన్ని స్వీకరించి.. వాటిని క్రాస్ ఎగ్జామిన్ చేయడంతో పాటు బహిరంగంగా విచారించింది కమిషన్. ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీల ప్రతినిధులను కూడా విచారించింది. అలాగే ప్రాజెక్ట్ డిజైన్లు చేసిన కంపెనీల ప్రతినిధులను కూడా కమిషన్ ఎంక్వైరీ చేసింది. ఈ ఏడాది పాటు సుదీర్ఘంగా జరిపిన ఈ విచారణలో దాదాపు అందరూ కూడా కేసీఆర్ పేరే చెప్పినట్లు తెలుస్తోంది. బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారని ప్రశ్నించగా.. ప్రధానంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరునే ప్రస్తావించినట్లు సమాచారం. స్థలాల ఎంపిక, బ్యారేజీలకు సంబంధించి కీలక నిర్ణయాలు, చెల్లింపుల నిర్ణయాల్లో కూడా ఆనాటి సీఎం కేసీఆర్, అప్పటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ప్రమేయంతో జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపు తుది దశకు చేరుకుంది. ఇప్పటి వరకు వచ్చిన వివరాలతో ఓ నివేదికను కూడా సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా నివేదిక ఇస్తే బీఆర్ఎస్ తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని భావించిన కమిషన్.. కేసీఆర్‌ను స్వయంగా విచారించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే కేసీఆర్ సహా హరీష్, ఈటలకు నోటీసులు పంపించింది. జూన్ 5లోపు వీళ్లు కమిషన్ ముందు హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ నోటీసుల్లో పేర్కొన్నారు. జూన్ 5 లోపు వాళ్లు ఎంచుకున్న తేదీ అయినా లేదా కమిషన్ నిర్ణయించిన తేదీల్లో విచారణ హాజరుకావాల్సిందిగా నోటీసులు తెలియజేశారు. అయితే కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేక న్యాయపరంగా ఎదుర్కుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.2024 మార్చి నుంచి 3 బ్యారేజీలపై విచారణ : మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, డిజైన్, నిర్వహణ, పే అండ్ ఎకౌంట్స్, క్వాలిటీ కంట్రోల్, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నీటిపారుదల, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఇలా ఎందరినో విచారించింది. ఇప్పుడు తాజాగా కేసీఆర్, హరీశ్రావు, ఈటల రాజేందర్లకు నోటీసులు పంపింది. వారు విచారణకు వస్తారేమో ఆ తేదీ వరకు ఆగాల్సిందే.కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్పై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణ : అలాగే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదుపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విచారణ ప్రక్రియను ప్రారంభించింది. విచారణలో భాగంగా ఈనెల 26 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు విచారణకు రావాలని ఏకంగా 63 మంది ఇంజినీర్లను పిలిచింది. ఈ విచారణ ఎనిమిది రోజుల పాటు జరగనుండగా, రిజర్వాయర్ నిర్మాణ సమయంలో పని చేసిన ఏఈఈలు ఇంజినీర్ ఇన్ చీఫ్ల వరకు హాజరు కావాల్సి ఉంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ రామచంద్రాపురం యూనిట్ ఎస్పీ, నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్కు రెండు రోజుల క్రితం లేఖ రాశారు.

# ప్రైవేటు ఫీజుల దోపిడీ

తరువాయి భాగం

స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా అన్నింటికీ ఫీజులు పిండే స్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతోపాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. పుస్తకాలు, యూనిఫాం, షూ కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేసేలా నిబంధన విధిస్తున్నారు. వాటి పేరిట మరి కొంత దోచేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు పాఠ్యపుస్తకాలను రూ.10వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు.



**అమలు కాని నిబంధనలు**

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 10వ తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఫీజు వసూలు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసుబోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయిస్తూ.. వాటినే బోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి తొమ్మిదోత రగతి వరకు ఇంటర్‌స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# 7 నెలల్లో 25 మందితో పెండ్లి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అనురాధా పాశ్వాన్ వయసు 32 ఏళ్లు. 25 మందిని పెళ్లి చేసుకుని.. వాళ్లను మోసం చేసిందామె. వారి ఇండ్ల నుంచి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లింది. అనురాధా పాశ్వాన్‌ను లూటింగ్ బ్రైడ్ అని.. లుటేరి దుల్హాన్ అని పిలుస్తున్నారు. వధువు పాత్రలో ఘరానా మోసాలకు పాల్పడుతున్న అనరాధను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లే..కొత్త పట్టణానికి వెళ్తే, కొత్త పేరుతో ఆమె పరిచయం చేసుకునేది. పెళ్లికి రెడీ అంటూ మగవాళ్లను మోసం చేసేది. ఆదర్శమైన వధువుగా నటిస్తూ.. అత్తారింట్లో ముచ్చటైన కోడలి పాత్రను పోషిస్తూ.. అనురాధా పాశ్వాన్ అందర్నీ మోసం చేసేది. ఫేక్ మ్యారేజీలతో ఉడాయిస్తున్న ఆ కిలాడీని సవాయి మాదోపూర్ పోలీసులు పట్టుకున్నారు. రివర్స్ గేమ్ ఆడి ఆమెను అరెస్టు చేశారు.ఒంటరిగా ఉన్నాను.. పేదింటి పిల్లను.. నిస్సహాయురాలిని.. ఉద్యోగం లేని సోదరుడున్నాడు.. పెళ్లి చేసుకోవాలి.. ఆర్థిక ఇబ్బందులున్నాయని చెబుతూ.. వెళ్లిన ప్రతి చోట అనురాధ పరిచయం చేసుకునేది. కానీ ఓ ఫేక్ మ్యారేజీ గ్యాంగ్‌కు ఆమే లీడర్. నమ్మించి మోసం చేయడంలో ఆమె ఎక్స్‌పర్ట్. పెళ్లి కోసం ఎదురుచూస్తున్న వ్యక్తుల వద్దకు ఆమె ఫోటోలను, ప్రొఫైల్‌ను గ్యాంగ్‌లోని సభ్యులే తీసుకెళ్లేవారు. పెళ్లిల బ్రోకర్ కూడా ఆమె గ్యాంగ్‌లో సభ్యుడై ఉంటారు. పెళ్లి కుదురుస్తామని చెప్పి ఆ బ్రోకర్ పాత్ర పోషించిన వ్యక్తి కూడా 2 లక్షలు తీసుకుంటాడు.

ఒకవేళ అంతా ఓకే అయితే పెళ్లి ఫిక్స్ చేస్తారు. పెళ్లి ఒప్పందం కుదిరాకా.. గుడిలోనే, ఇంట్లోనో పెళ్లి నిర్వహిస్తారు. సంప్రదాయ, ఆచారాల ప్రకారమే ఆ వేడుక జరుగుతుంది. ఇక ఆ తర్వాతే అసలు గేమ్ మొదలవుతుంది. వరుడితో, అతని ఇంటివాళ్లతో చాలా హుందాగా ప్రవర్తిస్తుందామె. నమ్మకాన్ని గెలుచుకుంటుంది. కుటుంబంలోని ప్రతి వ్యక్తితో ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పర్చుకుంటుంది. కొన్ని రోజుల్లోనే తన నిగూఢ ప్లాన్‌ను అమలు చేస్తుంది. ఇంట్లో వాళ్లకు ఆహారంలో మత్తు ఇచ్చి.. బంగారం, నగదుతో పరారీ అవుతుంది. ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నా పట్టుకెళ్తుంది. కిలాడీ అనురాధ జిత్తులకు బాధితుడైన విష్ణు శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కూపీ లాగారు. సవాయి మాదోపూర్‌కు చెందిన విష్ణుశర్మ హిందూ సంప్రదాయ పద్ధతుల్లో పాశ్వాన్‌ను పెళ్లి చేసుకున్నాడు. బ్రోకర్ పప్పూ మీనా ద్వారా పెళ్లి కుదిరింది. పప్పూ మీనాకు విష్ణు 2 లక్షలు ఇచ్చాడు. పెళ్లి అయిన రెండు వారాల్లోనే ఇంట్లో ఉన్న 1.25 లక్షల విలువైన జ్యులరీ, 30 వేల నగదు, 30వేల ఖరీదైన ఫోన్‌ను పాశ్వాన్ ఎత్తుకెళ్లింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
21.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## మాజీ అణుశాస్త్రవేత్త ఎంఆర్ శ్రీనివాసన్ కన్నుమూత

విశాలభారతి,స్టేట్ బ్యూరో:మాజీ అణు శాస్త్రవేత్త, అటామిక్ ఎనర్జీ కమీషన్ మాజీ చైర్మెన్ మాలూరు రామస్వామి శ్రీనివాసన్ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. స్వదేశీ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో డాక్టర్ హోమీ బాబాతో కలిసి శ్రీనివాసన్ పనిచేశారు. ప్రతిష్టాత్మక పద్మ విభూషన్ పౌర పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రభుత్వం నివాళి అర్పించింది. తమిళనాడులోని ఉదగమండళం జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు పుష్పాంజలి ఘటించారు. ఎంఆర్ శ్రీనివాసన్ .. బెంగుళూరులో జనవరి 5, 1930లో జన్మించారు. సైన్స్ సబ్జెక్టులో మైసూరు నుంచి ఇంటర్ చదివారు. సంస్కృతం, ఇంగ్లీష్ భాషలను ఎంచుకున్నారు. ఫిజిక్స్ ఆయనకు ఇష్టమైన సబ్జెక్ట్. 1950లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పొందారు. ఎం.విశ్వేశ్వరయ్య కూడా ఈయనతోనే కలిసి చదివారు. 1952లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. కెనడాలోని మాంట్రియల్‌లో ఉన్న మెక్‌గిల్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తి చేశారు. గ్యాస్ టర్బైన్ టెక్నాలజీలో స్పెషలైజేషన్ చేశాడు. 1955లో ఆయన డీఏఈలో చేరాడు. తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి 1959 ఆగస్టులో డాక్టర్ శ్రీనివాస్‌ను ప్రిన్సిపల్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా నియమించారు. దేశ అణ్వాయుధ కార్యక్రమాల రూపకల్పన అతని నాయకత్వంలో సాగింది. మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్‌కు 1967లో చీఫ్ ప్రాజెక్టు ఇంజినీర్‌గా చేరారు.



హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి,జలమండలి అధికారులతో కలిసి డివిజన్లోని మహేశ్వరి కాలనీలో నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులు ప్రారంభం కానున్న సందర్భంగా జలమండలి మేనేజర్ రాజు తో కలసి లెవెల్స్ పరిశీలించారు.

## జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న
# వనస్థలిపురం కటాక్ష సిల్క్స్

- సుమాజీ దేకోజి కటాక్ష సిల్క్స్ లీలలు.
- అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు
- కటాక్ష సిల్క్స్ బట్టల షాప్ పై దళిత సంఘాల ఆగ్రహం.
- ఓపెనింగ్ రోజు దళిత సంఘాలు ధర్నా నిర్వహించనున్నట్లు విశ్వనీయ సమాచారం
- అనుమతులు లేకున్నా పెద్ద పెద్ద ఓడింగ్స్ తో ప్రచార వ్యాపారం
- భద్రతా ప్రమాణాలు లేకున్నా పెద్ద పెద్ద ఫ్లెక్సీలు
- భవనానికి ఫైర్స్ సేఫ్టీ కరువు... అగ్ని ప్రమాదం జరిగితే అంతే సంగతులు.









**ఎల్బీనగర్ విశాల భారతి:**

వనస్థలిపురం పనామా గోడౌన్స్ నుంచి పోలీస్ స్టేషన్ వెళ్లే దారిలో ఈనెల 22వ తేదీన గ్రాండ్ గా ఓపెనింగ్ చేస్తున్న కటాక్ష సిల్క్స్ పై పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కటాక్ష సిల్క్స్ భవనానికి ఎలాంటి అనుమతులు లేకున్నా భారీ ఎత్తున సెట్టింగ్ వేసి ప్రారంభోత్సవం చేస్తున్నారని, ఈ ప్రారంభోత్సవంలో ఎల్బీనగర్ ఎక్కడ చూసినా పర్మిషన్ లేని పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో రౌండ్ హోల్డింగ్ లతో పబ్లిసిటీ చేస్తూ జిహెచ్ఎంసికి గండి కొడుతున్నారనే ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి. పైగా భద్రతా ప్రమాణాలను బేఖాతరు చేస్తూ ఫ్లెక్సీలు అడ్డగోలుగా విస్తరింప చేయడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా ఫ్లెక్సీలు కూలి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ప్రారంభోత్సవాలు చేస్తున్నటువంటి షాపింగ్ మాల్స్ కు సంబంధించిన పబ్లిసిటీని సదరు జిహెచ్ఎంసి నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. పబ్లిసిటీ కి సంబంధించిన పూర్తి కార్యక్రమాలను, వివరాలను జిహెచ్ఎంసి అధికారులకు, స్థానిక పోలీస్ స్టేషన్లో వివరాలు ఇవ్వవలసి ఉంటుంది. డబ్బు, పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంటే హైదరాబాదులో ఏదైనా చేసుకోవచ్చనే అహంకారంతో ముందుకు వెళుతున్న కటాక్ష సిల్క్స్ పై తగు చర్యలు తీసుకోవాలంటున్నారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే వనస్థలిపురంలో వెలుస్తున్న సదరు కటాక్ష సిల్క్స్ పై విచారణ జరిపి జిహెచ్ఎంసి హోర్డింగ్స్ మీద రావలసిన జిహెచ్ఎంసి ఆదాయాన్ని వెంటనే చెల్లించుకోవాలని పలువురు సామాజికవేత్తలు సూచిస్తున్నారు. పైగా భవనానికి ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేదని ఏదైనా జరగరానిది జరిగితే జనాలకు తీవ్ర నష్టం జరిగి అంతే సంగతులు అంటున్నారు. పైగా ఆ భవనం పైనే ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ ఉండడం విశేషం. ఈ ప్రచారంలో భాగంగా హస్తినాపురం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ఉంది. అయితే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను అవమాన పరిచే విధంగా అంబేద్కర్ విగ్రహం కనిపించకుండా చుట్టూ చాలా ఫ్లెక్సీలు, ఓ రౌండ్ హోర్డింగ్లు వెలవడం, దీనికి సంబంధించిన కేసు స్థానిక పిఎస్ లో ఫిర్యాదులు కావడం జరిగిందని విశ్వనీయ సమాచారం. ఈ కటాక్ష సీల్స్ ప్రారంభోత్సవంలో ప్రముఖ యాంకర్ సుమ వస్తున్నట్లు కూడా ప్రచారం చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి సుమ వచ్చినట్లయితే ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు, లా అండ్ ఆర్డర్ సమస్య కూడా కానున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో అటు జిహెచ్ఎంసి అధికారులు, ఇటు పోలీస్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.










## అనుమతి లేని ప్రైవేట్ హాస్టల్ పై చర్యలు తీసుకోవాలి

- కాసులకు కక్కుర్తి పడుతున్న ప్రభుత్వ అధికారులు
- అబ్దుల్లాపూర్మెట్ మండల ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ శూన్యం
- పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రవేట్ హాస్టల్ యజమానులు
- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్



**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలో పుట్టగొడుగుల వెలుస్తున్న ప్రైవేటు హాస్టల్స్. బీసీ పీపుల్స్ ఫెడరేషన్ దృష్టికి రావడం జరిగింది. బీసీ పీపుల్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో మండల పరిధిలో ఉన్న హాస్టల్స్ ఎలాంటి పర్మిషన్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా నిర్వహిస్తున్నారని మండల పరిధిలో ఎమ్మార్వో కు ఎంపీఓ కు ఫిర్యాదు చేయడం జరిగింది. హాస్టల్లు నిర్వహిస్తున్నటువంటి బిల్డింగ్ ఓనర్ హాస్టల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వారికి నచ్చిన రీతిలో పేద విద్యార్థుల దగ్గర ఐదు వేల నుండి పదివేల రూపాయలు హాస్టల్ ఫీజుల రూపంలో వసులు చేస్తా ఉన్నారు. కనీసం నిబంధనలు పాటించడం లేదు. గతంలో హాస్టల్‌లో ఒక నిరుపేద విద్యార్థి హాస్టల్ గదిలోనే సూసైడ్ చేసుకోవడం జరిగింది. ఆ సూసైడ్ చేసుకున్నటువంటి విద్యార్థికి బిల్డింగ్ ఓనర్ గాని హాస్టల్ నిర్వహిస్తున్న నిర్వాకులు గాని వారిని అక్కడి ప్రజాప్రతితులు గాని ఆ విద్యార్థికి ఎలాంటి న్యాయం జరగలేదని తల్లిదండ్రులు వాపోయారు.వారి కుటుంబాన్ని ఆదుకున్న పాపాన పోలేదు. అధికారుల నిర్లక్ష్యం ఇటు ప్రజా ప్రతినిధులు కూడా అటువైపు చూడకపోవడము హాస్టల్ నిర్వాహకులు మేము ఎంత చెపితే అంత అనే విధంగా వ్యవహరిస్తా ఉన్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్నటువంటి హాస్టల్లో పైన అధికారుల అలసత్వం అక్కడున్న అధికారులు హాస్టల్ యజమానులు ఇస్తున్నటువంటి కాసులకు కక్కుర్తి పడి అటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇటు ప్రభుత్వాలకు గండి కొడుతున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఫైర్ సేఫ్టీ , బిల్డింగ్ పర్మిషన్,పోలీస్ పర్మిషన్, మండల అధికారినుండి , మున్సిపల్ అదికారుల నుండి విద్యుత్ అధికారుల నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతు బిల్డింగ్ పార్కింగ్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో దాదాపుగా 70 నుంచి 80 హాస్టల్స్ అధికారుల కళ్ళు గప్పి ఇటు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి హాస్టల్ యజమానులు నెలకు లక్షల్లో సంపాదిస్తున్నరు. జిఎస్టి ,సిజిఎస్టి కట్టకుధా ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్నారు.మండల పరిధిలో ఉన్నటువంటి అధికారులు హాస్టల్లపైన దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది అన్నారు, వారి భద్రతకు అవసరమైన అటువంటి ఏమీ లేకుండా హాస్టల్ ఏర్పాటు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని కోరారు హాస్టల్లో ఉండే వారి భద్రతకు అవసరమైన చర్యలు భద్రత నియమాలను పాటించాలని అన్నారు

## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో రన్యారావుకు బెయిల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావు తో పాటు తరుణ్ రాజ్ కొండూరు కు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఇద్దరికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని.. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని.. భవిష్యత్‌లో ఇదే తరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది.
ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (DRI) 60 రోజుల్లోగా చార్జిషీట్‌ని దాఖలు చేయలేకపోయారు.ఈ క్రమంలో రన్యారావు, తరుణ్ రాజ్ ఇద్దరు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. కన్నడ నటి అయిన రన్యారావును మార్చి 3న బంగారం స్మగ్లింగ్ కేసులో డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకొని.. రూ.12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.14.2 కిలోల విదేశీ బంగారు కడ్డీలను తీసుకెళ్తున్నట్లు ఆమె గుర్తించింది. ఇదే కేసులో తరుణ్ రాజ్, సాహిల్ సకారియా జైన్‌లను అరెస్టు చేశారు. ప్రస్తుతం ముగ్గురు బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 22న కేంద్రం ముగ్గురిపై కొఫిపోసా చట్టాన్ని ప్రయోగించింది. బెయిల్ లేకుండా దాదాపు సంవత్సరం పాటు నిందితులను నిర్బంధించడానికి చట్టం వీలు కల్పిస్తుంది. ఇటీవల రాన్యా తల్లి చట్టం కింద ఆమెను నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. అభ్యంతరాలు దాఖలు చేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ జూన్ 3వ తేదీకి వాయిదా పడింది

# లక్షల్లో అడ్మిషన్ ఫీజులు
# అకాడమీతో నాటకం

- వివరణ కోరితే పొందన లేని సమాధానాలు
- అధికారుల మౌనమే అంగీకారమా?
- గుర్తింపు లేని శ్రీ గాయత్రీ క్షేత్ర సెంటర్ పై స్పెషల్ స్టోరీ







KSHETRA - CENTER FOR LEARNING
kalapathar
FEE RECEIPT

| | | | |
|---|---|---|---|
| Transaction ID | : RG6011304052514060006054 | Transaction Date | : 04 May 2025 |
| Name of the student | : RASHA BEGUM | Receipt No. | : C0077 |
| Father Name | : MD AFZAL | Admission No | : |
| Mother Name | : RAFIA BEGUM | Class | : STATE JR CEC / |
| Unique ID / Enrollment Code | : | Academic Year | : 2025-2026 |

| S.no | Particulars | Amount |
|---|---|---|
| 1 | Registration Fee ( ) | 3000.00 |
| | Total Amount | 3000.00 |

Received by Cash

Cashier / Manager

Note : Parents are requested to preserve this receipt for future clarifications in respect of fee paid by you. Fee once paid will not be refunded or transferred.Cheques subject to realization.



**విశాలభారతి హైదరాబాద్ :**

కాలాపత్తర్‌లోని ఓ చిన్న వీధిలో ఉన్న శ్రీ గాయత్రి క్షేత్ర సెంటర్ బ్రాంచ్ కళాశాల ఎదుట ఉదయం నుంచే తల్లిదండ్రుల క్యూలు కనిపించటం మామూలే. కానీ అర్థంలేని భయంతో, "ఇంకో చోటు దొరకకపోతే?" అనే ఆందోళనతో వారు చేతుల్లో వేల నోట్లు పట్టుకుని నిల్చుంటారు.“లక్ష రూపాయల అడ్మిషన్ ఫీజా?” అని ప్రశ్నించిన తండ్రిని ఓ సిబ్బంది వెక్కిరిస్తూ చూస్తూ, “ఇది శ్రీ గాయత్రి అకాడమీ. నాణ్యతకు తగ్గ ఖర్చు తప్పదు!” అని అంటారు. ఇదే మాటను జిల్లాలోని చాలామంది తల్లిదండ్రులు విన్నారు – కానీ, ఆ ‘నాణ్యత’కు ఏమిటి అర్హత? ప్రశ్నించినవారికి సమాధానాలంటే ఉండవు, ఉదాసీనతే మిగిలింది. హైదరాబాద్ జిల్లాలో ఈ తరహా అకాడమీ ఇన్స్టిట్యూషన్ల పేరిట నడుస్తున్న ప్రైవేట్ కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. పేర్లు మారినా, ఆట ఒకటే – లక్షల్లో ఫీజులు వసూలు, ఫలితాల పేరుతో తల్లిదండ్రులకు భయం చూపించి డబ్బులు వంచటం.

**అధికారుల మౌనమే అంగీకారమా?**

10/05/2025 న విశాలభారతి పత్రికలో ప్రచురితమైన కథనాల్లో స్పష్టంగా ఈ అక్రమాలపై ఆరోపణలు వచ్చాయి. కానీ, “ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి” అని అడిగితే, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాత్రం కాలం వెళ్లదీస్తూ, “మా పరిధిలో రావు”, “వీటి మీద చర్యలు చేపట్టాలంటే స్పష్టమైన ఆధారాలు కావాలి” అనే బహుళ సాకుల్ని వినిపిస్తున్నారు.
“ఐ డోంట్ కేర్” అనే ధోరణితో మాట్లాడుతున్న ఆ అధికారి గత నాలుగేళ్లుగా హైదరాబాద్ జిల్లాలో పదవిలో ఉన్నారు. ఈ కాలంలో ఎందరో విద్యార్థుల జీవితాలు డబ్బు వ్యాపారంగా మారిపోయాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రైవేట్ యాజమాన్యాలకే లాభాలు తీరుతున్నాయి.

**అకాడమీ అనే బురడిలో విద్యార్థుల భవిష్యత్తు**

ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఉత్తుత్తి నోటీసులు పంపించి, రెండు రోజుల్లోనే మరిచిపోవడం అధికారులకు అలవాటు. కళాశాల యాజమాన్యాలతో చేతులు కలిపినట్టు అనిపించే తీరుతో తల్లిదండ్రులు విసిగిపోయారు. “మా బిడ్డ భవిష్యత్తు కోసం ఏమైనా చేస్తాం” అనే తల్లిదండ్రుల నమ్మకాన్ని ఉపయోగించుకుంటూ లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న ఈ అకాడమీ నాటకాన్ని ఆపేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

**ప్రశ్నించని సమాజం - స్పందించని అధికారులు**

తల్లిదండ్రుల కన్నీళ్ళను ఎవరూ పట్టించుకోకపోతే, విద్యార్థుల నిధులు దోచుకుంటున్న ఈ వ్యవస్థపై ఎప్పుడు చర్యలు వస్తాయో ఎవ్వరికీ తెలియదు. ఒకవేళ ఈ రోజున ప్రశ్నించకపోతే, రేపటి తరం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
21.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తే ఊరుకునేదే లేదు

- ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు

**నూతనకల్, విశాలభారతి:** మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి వాటిని అమలు చేస్తే దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని తక్షణమే వాటిని రద్దు చేయాలని ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు అన్నారు. దేశవ్యాప్తగా జరిగే సార్వత్రిక సమ్మె ను జూలై 9 కి జాతీయ కార్మిక సంఘాలు వాయిదా వేశాయి. దేశ వ్యాప్తంగా నిరసన దినంగా కార్మిక వర్గం పాటించాలని పిలుపునిచ్చిన సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కరోనా కాలంలో నాలుగు లేబర్ కోడ్లను పార్లమెంటులో ప్రవేశ పెట్టి కార్మికుల హక్కులను కాలరాయడానికి పూనుకుందని అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులు బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను భవిష్యత్తులో అమలు కాకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్ల ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కూసు ఉప్పలయ్య, గంట రామకృష్ణ , గోపాల్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి నక్క ఎల్లయ్య, మండల కమిటీ సభ్యులు మరికంటి సుదర్శన్, హమాలీ యూనియన్ నాయకులు ఎస్కే జబ్బార్, సత్తయ్య, నాగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్ తో విహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడి మృతి



**నారాయణపేట, విశాలభారతి:** బ్రెయిన్ స్ట్రోక్ తో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వి హెచ్ పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంబాబు మంగళవారం మృతి చెందారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఈ మధ్యనే జిల్లా అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే హిందూ ధర్మ జాగరణ కార్యక్రమాలను నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు.వైద్యవృత్తిలో కొనసాగుతూనే డాక్టర్ రాంబాబు విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షులుగా గణేష్ ఉత్సవ సమితి నారాయణపేట పట్టణ అధ్యక్షులు ఫుల్ టైంగా పనిచేశారు.అంత్యక్రియలను బుధవారం స్వగ్రామమైన నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.విశ్వహిందూ పరిషత్ నారాయపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంబాబు మృతి పట్ల హిందూధర్మిక సంస్థల ప్రతినిధులు ఆయా పార్టీల నాయకులు,నారాయణపేట జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం బాధాకరమని హిందూ సమాజానికి డాక్టర్ రాంబాబు ఆకస్మిక మృతి తీవ్రలోటని అభిప్రాయం వ్యక్తం చేశారు



# నేరాలు నివారించడానికి సీసీ కెమెరాలు

- డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, విశాలభారతి:** మంగళవారం రోజు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో,కమాండ్ కంట్రోల్ లోని సీసీ కెమెరాలను డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ పోలీసులు నిరంతరం సీసీ కెమెరాలను పరిశీలిస్తూ జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన,రోడ్డు ప్రమాదాలు,అల్లర్లు జరిగిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతిరోజు ఐటి కోర్ టీమ్ మానిటరింగ్ తో సిసి కెమెరాలను టెక్నీషియన్లతో ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఉండడంవల్ల దొంగతనాలు చేయడానికి భయపడతారని మరియు అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని,నేరాల నివారించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని మరియు జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి త్వరితగతిన ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సహాయం అందించడం జరుగుతుందని, పోలీస్ స్టేషన్లో ఉద్యోగాల పనితీరు ఎలా ఉంది సమయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు అనే విషయాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా గ్రామాలలో కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ కోరారు.

# భీమదేవరపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలోలబ్ధిదారులకు చెక్కుల అందజేత



**విశాలభారతి,భీమదేవరపల్లి :** మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద లబ్దిదారులకు ఆర్థిక సహాయ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి సదానందం మరియు ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సహకారంతో ఈ సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన పోలు ఐలయ్యకు రూ.42,000, ముడిదొడ్డి కావేరికి రూ.35,000, గుండేటి సునీతకు రూ.13,000, గుండేటి వికాస్‌కు రూ.14,000 విలువైన చెక్కులు లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బా శంకర్, మాచర్ల సదానందం, చాగంటి వెంకటేశ్వర్లు, ఎలుకపల్లి ప్రేమలత పాల్గొన్నారు.

## ఆడ కూతురు పెళ్లికి పుస్తె మట్టెలను అందజేసిన బబ్బూరి

- జనగామ జిల్లా నాయకులు బప్పూరి శ్రీకాంత్ గౌడ్



**దేవరుప్పుల, విశాలభారతి:** ధర్మాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తలూరి నాగరాజు,రవి మేనకోడలు శ్రీజ వివాహానికి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బబ్బురి శ్రీకాంత్ గౌడ్ అండగా నిలిచారు.వారికి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,కార్యదర్శి చింత రవి ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన దేవరాజు, తాళ్లపల్లి రామకృష్ణ, దౌపాటి అనిల్, దౌపాటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడీ

- పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ఇసుక దందా
- గిరిజనుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న కాంట్రాక్టర్లు
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య




**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు సబ్ డివిజన్ లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడి నడుస్తుందని, గోదావరి మధ్యలో ఇసుక తోడడం కారణంగా పర్యావరణం పై తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. మంగళవారం స్థానిక శ్రామిక భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనల పట్టా భూములలో పేరుకుపోయిన ఇసుకను, గిరిజనుల అనుమతితో తవ్వకాలు నిర్వహించాలి దానిలో భాగంగానే ఇసుక సొసైటీల పేరుతో ఇసుక తవ్వకాలు నిర్వహించాలి. కానీ దీనికి విరుద్ధంగా ఇసుక తవ్వకాలు గోదావరి మధ్యలో నిర్వహించడం పర్యావరణాన్ని ఉల్లంఘంచడమేనని అన్నారు. నిబంధనల ప్రకారం రెండు మీటర్ల లోతు వరకే ఇసుక తవ్వకాలు జరపాలి కానీ భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారు అని అన్నారు. దీని కారణంగా పర్యావరణం తీవ్ర ముప్పు ఏర్పడుతుందని భూగర్భజాలాలు అడుగంటుతున్నాయని తెలిపారు. ఒకే బిల్లుపై అనేక లారీల ఇసుకను తరలిస్తున్నారని, జీరో దందా వ్యాపారం జోరుగా కొనసాగిస్తూ, బిల్లులో ఉన్న ఇసుక కన్నా అధికంగా ఇసుక లోడ్ చేసుకొని డబ్బులు దండుకుంటున్నారని ఆయన అన్నారు. స్వలాభం కోసం రైజింగ్ కాంట్రాక్టర్లు ఎలాంటి అమరికలు లేకుండా కలిసిమెలిసి ఉండే గిరిజన గ్రామాలలో ఇసుక సొసైటీల పేరుతో అలజడి సృష్టిస్తున్నారని అన్నారు. అనేక సంవత్సరాలుగా మణుగూరు సబ్ డివిజన్ లో ఒకే కాంట్రాక్టర్ ఇసుక దందా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, మడి నరసింహారావు, పిట్టల నాగమణి, కుంజా రాజు, సున్నం మల్లేష్, కోంద్రు గౌరీ, ఖతిజా బేగం, సంకినేని వెంకటరావు, కోటయ్య, ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన సమస్యలను పరిష్కరించాలి

**దేవరుప్పుల, విశాలభారతి:** సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ మహేందర్ నాయక్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ తాండ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలి పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రమాణాలు మెరుగుపరుచుటకు తాండ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి. సంవత్సరానికి కోటి రూపాయలు ప్రతి ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించాలి గిరిజన రైతులకు రైతు భరోసా ఎకరాకు రూ. 10వేలు చొప్పున సంవత్సరానికి రెండు పర్యాయాలు వ్యవసాయ సీజన్ లోనే సకాలంలో ఇవ్వాలి నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు సబ్సిడీపై సరఫరా చేసి గిరిజన రైతులను ఆదుకోవాలి

పై డిమాండ్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ, ఈరోజు సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధారావత్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ బిక్షపతి, నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రమేష్, జిల్లా యువజన అధ్యక్షులు తేజాత్ మోహన్ నాయక్ ,జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ ధరావత్ ప్రకాష్ నర్మెట మండల అధ్యక్షులు బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మార్చాలి




**నారాయణపేట, విశాలభారతి:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్,ఐసిపిఎస్,డి హెచ్ ఈ డబ్ల్యూ,చైల్డ్ హెల్ప్ లైన్ విభాగాల ఉద్యోగులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసిజిల్లాలో బాల్యవివాహాలు లేని గ్రామాలుగా మార్చాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.సమావేశం ప్రారంభంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్(ఇంచార్జ్ డీ డబ్ల్యు ఓ)సంచిత్ గ్యాంగ్వర్ శాఖా పరంగా బాల్య వివాహాల నివారణకు చేపట్టిన చర్యలు ,తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సమావేశంలో క్లుప్తంగా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ గ్రామాలు,మండలాల వారిగా సమావేశాలు నిర్వహింపజేసి బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో బడి బయట బాలికలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి వారి వివరాలతో కూడిన జాబితాను తయారు చేయాలని సూచించారు.జిల్లాలో ఏర్పాటు చేసిన బాలిక మండలి కమిటీల సమావేశాలను ఎజెండాతో నిర్వహించాలన్నారు. అలాగే గ్రామస్థాయిలో అంగన్వాడి టీచర్లు ,పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలన్నారు.జిల్లాలో ఇకపై జరిగే పెళ్లిలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకునేలా అవగాహన కల్పించాలని,ఆధార్ కేంద్రాలలో వయస్సు పెంచి ఆధార్ కార్డు జారీ చేయకుండా ఆధార్ కేంద్రాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేస్తామని అన్నారు. సమావేశంలో డీఎస్పీ నల్లపు లింగయ్య,డీఆర్డిఓ మొగులప్ప,డిపిఓ సుధాకర్ రెడ్డి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్,సిడబ్ల్యు సీ ఛైర్మెన్ అశోక్ కుమార్,డీ పి వో బిక్షపతి,అన్ని మండలాల తహసీల్దార్లు,సీడీపి వోలు,అంగన్ వాడీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే గుణాత్మక విద్య

- ఎంఈవో పానుగోతు ఛత్రు నాయక్

**గరిడేపల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉత్సాహపూరిత వాతావరణంలో మండలంలోని ఉపాధ్యాయులకు 5 రోజుల వృత్యంతర శిక్షణా కార్యక్రమంను పానుగోతు ఛత్రు నాయక్ ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ సార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లలోనే బడుగు,బలహీన వర్గాలకు ఉచిత గుణాత్మక విద్య అందిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెంపొందించుటకు 5 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతుందని తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా చదువులో వెనుకబడి ఉన్న చివరి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించే విధంగా మనమందరం కృషి చేయాలని,విద్యార్థులకు ఆనందదాయమైన బోధన అందించాలని అన్నారు. ఈ సందర్భంగా కీతవారి గూడెం పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ మేడం మాట్లాడుతూ మన మండలంలో ప్రతి టీచర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నారని అభినందిస్తూ ఈ శిక్షణ ద్వారా చక్కని బోధనా మెలకువలు నేర్చుకొని జిల్లాలో మన మండలాన్ని విద్యలో ఆదర్శంగా నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్,దయాకర్, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి,బాల సైదిరెడ్డి, చంద్రయ్య, హైమవతి, పద్మ, బాలస్వామి,సైదులు,రవి నాయక్,శ్రీనివాస్ రాజు, లక్ష్మయ్య, శ్రావణి, శిరీష, సుజాతమండల తెలుగు నాగేశ్వర్ రావు, రవీందర్, ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్స్ పాపయ్య,నాగేశ్వర్ రావు,గణిత రిసోర్స్ పర్సన్స్ కోటేశ్వర్ రావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని దండు మల్కాపురం గ్రామంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు ముదిగొండ వెంకటేష్ ,దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తదనంతరం అన్నదాన కార్యక్రమం చేసి మూగజీవాలకు పండ్ల పంపిణీ చేసి జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ మీ నటనా ప్రతిభతో కోట్ల మంది అభిమానులను గెలుచుకున్న మీరు,ఎప్పుడూ ఆరోగ్యంగా,ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు బుర్ర అయోధ్య,సందగళ్ళ శెఖర్, పబ్బు శ్రీనివాస్,యండి షాదిక్, దౌడి లింగస్వామి,చందుపట్ల సాయి నేత, కృష్ణ ముర్తి,కిష్టయ్య, పంతంగి.మధు,మహంకాళి జితేందర్,అజ్జి,అబ్బాస్,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
21.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


### బలమైన ఆధారాలుంటేనే ఉపశమనం

విశాలభారతి, స్టేట్ బ్యూరో: వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమేనన్న భావన సర్వత్రా ఉందని, అయితే వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తున్న పిటిషనర్లు తమకు మధ్యంతర ఉపశమనం దక్కాలంటే బలమైన, విస్పష్టమైన ఆధారాలు చూపించాల్సిన అవసరం ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం వక్ఫ్ చట్టం చట్టబద్ధతను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభించింది. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారంతో సహా మూడు అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. 'పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం రాజ్యాంగబద్ధమేనన్న భావన ఉంది. మధ్యంతర ఉపశమనం మీకు లభించాలంటే బలమైన, విస్పష్టమైన ఆధారాలు మీరు చూపించాలి. లేకపోతే రాజ్యాంగబద్ధత భావన అలాగే ఉంటుంది' అని సీజేఐ తెలిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తన వాదన ప్రారంభిస్తూ వక్ఫ్ చట్టం చారిత్రకంగా, న్యాయపరంగా, రాజ్యాంగ సూత్రాల పరంగా పూర్తి విరుద్ధమని అభివర్ణించారు. న్యాయ వ్యవస్థ రహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ని స్వాధీనం చేసుకునే మార్గంగా ఆయన ఈ చట్టాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ మూడు అంశాలకే పిటిషన్లపై విచారణ పరిమితం కావాలని అభ్యర్థించారు.



# భీమదేవరపల్లి మండల మహిళలు హిందూ ఏక్తా యాత్రకు తరలిరండి

- బీజేపీ నాయకురాలు అంబీరు కవిత పిలుపు

విశాలభారతి,భీమదేవరపల్లి : హనుమాన్ జయంతి సందర్భంగా మే 22 (గురువారం) న కరీంనగర్‌లో జరగనున్న హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయడానికి భీమదేవరపల్లి మండలం నుంచి మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని భారతీయ జనతా పార్టీ మండల మహిళా నాయకురాలు అంబీరు కవిత పిలుపునిచ్చారు. ఈ యాత్రను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. హిందూ సమాజంలో ఐక్యతను ప్రతిబింబించే విధంగా ఈ యాత్ర జరుగుతుందని, మహిళలు కుల, మత, పార్టీ భేదాలు లేకుండా పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ, "పహాల్గాంలో హిందువుల తిలకాన్ని చూసి ఉగ్రవాదులు కాల్చిచంపారు. దానికి ప్రతిగా ప్రధాని నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదులను నిర్మూలించారు. ఈ చర్యలు మహిళల మనస్సుల్లో ధైర్యాన్ని నింపాయి" అని అన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు దొంగల వేణు, మొకిడి రజిత, దేవరాజు పద్మ, మట్టెడ సుజాత, మట్టెడ దివ్య, మంజుల, దండేపల్లి విజయ, దండేపల్లి పాపి, లద్దునూరి స్వరూప, మ్యాక శ్రీలత, మ్యాక అనసూయ, చరిష్మా తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి




సూర్యాపేట,విశాలభారతి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఏ ఐ టి యూ సి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు వద్ద సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్టియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ 4 లేబర్ కోడ్ లను తీసుకొస్తున్నారని, కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయని, 8గంటల పనిని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంబంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తూ ప్రభుత్వ రంగంలో కార్మికొద్యమం మీద, కార్మిక ఐక్యత మీద దాడి చేస్తుంది. కులం, మతం, అస్తిత్వ భావజాలంతో కార్మికొద్యమం దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏం. రాంబాబు , సాయి కుమార్, శివ కృష్ణ, దానేలు, వీరయ్య, కస్తూరి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు చామల అశోక్, షేక్ లతీఫ్, బురా వెంకటేశ్వర్లు, నిమ్మల ప్రభాకర్, ఎస్, రాఘవరెడ్డి, ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కునుకుంట్ల సైదులు, ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు సామా నర్సిరెడ్డి, సూరారపు లక్ష్మణ్ ,పుల్లూరు సింహాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసు సత్యం, జంపాల స్వరాజ్యం పాల్గొన్నారు.




# రైతులకు సమగ్ర ఎరువుల వినియోగంపై అవగాహన

- ముఖ్యఅతిథిగా హాజరైన ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు రెడ్డి ప్రవీణ్ రెడ్డి

విశాలభారతి భీమదేవరపల్లి : ప్రధానమంత్రి ప్రణామ్ కిసాన్ సంఘోస్తి కార్యక్రమం మంగళవారం ముల్కనూరు కోఆపరేటివ్ సొసైటీలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఐపీఎల్ కంపెనీ (ఇండియన్ పొటాష్ లిమిటెడ్) వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముల్కనూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఐపీఎల్ స్టేట్ మేనేజర్ జాఫర్ మక్బూల్, మండల వ్యవసాయ అధికారి పద్మ, కె.వికె మామునూర్ నుండి ఎన్. రాజన్న (ఎండమాలజీ), సిహెచ్. సౌజన్య (ఆగ్రానమీ), డాక్టర్ వెంకటేశ్వర్లు (సీనియర్ సైంటిస్ట్, కేవీకే జమ్మికుంట) తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతులకు సముచితమైన ఎరువుల వినియోగం, మన్నికైన వ్యవసాయ పద్ధతులు, మట్టికి తగిన విధంగా ఎరువుల పంపిణీ గురించి వివరించడమైనది. ఐపీఎల్ సంస్థ గత సంవత్సరాలలో చేసిన సేవలు, ప్రత్యేకించి రైతులకు ఎరువుల సరఫరా విధానం మరియు వాటి వినియోగం పై అవగాహన కల్పించారు. జిల్లా స్థాయి నుంచి ఐపీఎల్ అధికారులు రాంబాబు, నిఖిల్, ప్రణీత్ లు కూడా కార్యక్రమంలో పాల్గొని రైతులకు మార్గనిర్దేశం చేశారు. రైతుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజ్ఞానవంతంగా ముగిసింది.

## అనుమతులు లేని హాస్పిటల్స్ లో
# మరణానికి కారకులెవరు

- డాక్టర్లా లేక జిల్లా వైద్యశాఖ అధికారా.
- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి.




సూర్యాపేట, విశాలభారతి: సూర్యాపేట జిల్లా కేంద్రంలో అనుమతి లేని హాస్పిటల్స్ లో వైద్యం వికటించి జరిగిన మరణాలకు కారకులెవరని, దీనికి బాధ్యత వైద్యం చేసిన డాక్టర్లదా లేక నిబంధనలను తుంగలో తొక్కి అనుమతులిచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులదా అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని ఎం వి ఎన్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ డాక్టర్లు కొంత మంది తప్పుడు ధృవీకరణ పత్రాలతో అనుమతులు పొంది ప్రజలకు వైద్యం చేసి అనేక మంది ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల విచారణ ద్వారా బయటపడిన నకిలీ డాక్టర్లు, అనుమతులు లేని స్కానింగ్ సెంటర్ల మూలంగా అనేక మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా, తప్పుడు రిపోర్ట్ ల మూలంగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వైద్యం కోసం హాస్పిటల్ కు వెళ్లి వైద్యం వికటించి మరణిస్తే తప్ప తప్పుడు హాస్పిటల్లను సీజ్ చేయరా అని ప్రశ్నించారు. అనుమతులు లేవని నోటీసులు జారీ చేసిన శ్రీ కృష్ణ హాస్పిటల్, సాయి గణేష్ హాస్పిటల్ లలో అనేకమంది వైద్యానికి వెళ్లిన ప్రజల నుండి ఫీజులు ముక్కు పిండి వసూలు చేసి ప్రజలను నిలువు దోపిడి చేశారని అన్నారు. ఇప్పటికైనా సూర్యాపేట పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సరైన అనుమతులు లేని హాస్పిటల్స్ లో వైద్యం తీసుకొని జరిగిన మరణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డాక్టర్ సగరపు ప్రసాద్ అభినందనీయుడు

- మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు.
- డాక్టర్ ప్రసాద్ సగరపుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయ రత్న అవార్డు



సూర్యాపేట,విశాలభారతి: నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ న్యాయవాది డాక్టర్ సగరపు ప్రసాద్ అభినందనీయుడని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మోత్కుపల్లి నరసింహులు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవం 2025 సందర్భంగా పలు సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ సగరపు ప్రసాద్ కు సామాజిక న్యాయ రత్న అవార్డు మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నరసింహులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింలు మాట్లాడుతూ డాక్టర్ సగరపు ప్రసాద్ సేవలను కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుతో సత్కరిస్తుందని గుర్తు చేశారు. ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం డాక్టర్ ప్రసాద్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పేద ప్రజల అభివృద్ధి కోసం గాను నిరంతరం శ్రమిస్తున్న సందర్భంగా ప్రభుత్వం గుర్తించి నాకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటిక రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొంతమంది శ్రేయోభిలాషులు ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో
# ఘనంగా లక్ష మల్లెల పూజ

సూర్యాపేట,విశాలభారతి: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ హనుమ జయంతి పంచాహ్నిక ఉత్సవములలో బాగంగా మంగళవారం 3వ రోజు వేద పండితులు దరురీ రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా లక్ష మల్లెల పుష్పార్చన నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకం నిర్వహించి, నూతన పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. స్వామి వారికి అష్టోత్తర పూజలు నిర్వహించి, వడమాల సేవ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద సామూహిక లక్ష మల్లెల పూజల లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హనుమ జయంతి వేడుకల సందర్భంగా ధరూరి శ్రీనాథచార్యుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు. దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఐదు రోజులపాటు జరుగు హనుమాన్ జయంతి వేడుకలలో బాగంగా 4వ రోజు బుధవారం లక్ష నాగవల్లి దళార్చన( తమలపాకులతో) పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22 గురువారం 5వ రోజు హనుమ జయంతి సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటల నుండి 108 పర్యాయములు హనుమాన్ చాలీసా పారాయణం, స్వామివారికి నిత్య ఆరాధన, ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన, స్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించబడుననీ తెలిపారు. హనుమ జయంతి వేడుకల సందర్భంగా సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎం.పీ లక్ష్మణరావు, దరూరీ శ్రీధరాచార్యులు, ధరూరి పవన్ కుమార చార్యులు, దరూరి కార్తీకా చార్యులు, భక్తులు వెంపటి సురేష్, పబ్బా ప్రకాష్, పబ్బా రామమూర్తి, పురం నాగరాజు, దేవేంద్ర చారి, తౌనుకునూరి వెంకటేశ్వర్లు, , పబ్బ సంధ్య, శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర సాధనలో
# జర్నలిస్టుల పాత్ర చారిత్రాత్మకం

సూర్యాపేట,విశాలభారతి: టీజేఎఫ్ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, ఈ నెల 31న హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహించే ఉత్సవాలకు యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని టీయూజేఎఫ్ హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్య, టీజేఎఫ్ వ్యవస్థాపక డివిజన్ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం గోడ పత్రికను యూనియన్ నాయకులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని, చారిత్రాత్మకమైనదని ఉద్యమ తొలి రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జర్నలిస్టులు చేసిన సాహసం మరువలేనిదన్నారు. ఈ ఇరవై ఏళ్ల ప్రయాణంలో టీజేఎఫ్ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలు, పార్టీలను, నాయకులను, సంస్థలను, సంఘాలను సమన్వయం చేసింది అని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ప్రభుత్వాలు సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు ఇవ్వనప్పుడు జర్నలిస్టులే ముందుండి సమావేశాలు, సభలను నడిపించారన్నారు. అల్లం నారాయణ గారు మారుతి సాగర్ గారు నేతృత్వంలో జరిగే కార్యక్రమం ఈనెల 31 న హైదరాబాదులో జరిగే తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాల కార్యక్రమానికి పెద్ద ఎత్తున సూర్యాపేట జిల్లా నుంచి జర్నలిస్టులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# ధనికుల దానం సామాన్యులపై భారం?

- "దానం పేరిట దగా?" – ఫ్రీజర్ బాక్స్‌లపై వసూలుతో ప్రజల్లో ఆగ్రహం
- "పేదలపై శవ బాక్సుల భారమా?"
- – వారం ఖర్చు ఒక రోజు అవసరానికే!
- ఫ్రీజర్ బాక్స్‌లపై ₹1000 వసూలు
- ప్రజల్లో ఆగ్రహావేశాలు

విశాలభారతి,భీమదేవరపల్లి: మరణం సామాన్యమైనా, మరణానంతర సేవలు మాత్రం వర్గాలవారీగా మారిపోయాయా? మండల ప్రజలు ఇప్పుడు ఇదే ప్రశ్నను ఎదురు వేస్తున్నారు. గ్రామంలో ప్రజాసేవ కోణంలో ఏర్పాటు చేసిన ఫ్రీజర్ బాక్స్‌లపై నిర్వహణ పేరిట వసూలు చేస్తున్న ₹1000 ఫీజు పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. 198889 జెడ్పిహెచ్ఎస్ విద్యార్థుల బ్యాచ్ మొదలుపెట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని, అనంతరం ఎదులాపురం సోదరులు తమ తల్లిదండ్రుల స్మృతికి గుర్తుగా కొనసాగించారు. తర్వాత గ్రామానికి చెందిన సుద్దాల సోదరులు, వారి స్నేహితులు దాతలు కొందరు కలిసి కూడా ఫ్రీజర్ బాక్స్‌లు సమకూర్చారు. ప్రస్తుతం సుద్దాల సోదరుల ఆ ఒక్క ఫ్రీజర్ బాక్స్ మాత్రమే పని చేస్తున్నది. కానీ వారు కచ్చితంగా 1000 ఇస్తేనే ఫ్రీజర్ బాక్స్ ఇస్తామని కరాకండిగా చెప్తున్నారు. పేద ధనిక భేదం లేకుండా వెయ్యి రూపాయలు వసూలు చేయడం ఏంటని పేద వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కానీ ఇప్పుడు ఈ సేవల నిర్వహణ పేరుతో వసూలు చేస్తున్న అధిక మొత్తాలు, ఆ దాతల ఆశయాలకు విరుద్ధంగా మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. “ఇవి దాతల స్వచ్ఛంద సేవా భావంతో ఏర్పాటైనవి. మరి మళ్లీ మనకే ఎందుకు ఖర్చు?” అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. “పేదలకు భారం కాకుండా ఉండాల్సిన ఈ సేవలు, ఇప్పుడు ఆర్థిక భారం కావడమే కాక, వాణిజ్య ధోరణిని సూచిస్తున్నాయి,” అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తీరుతో కొనసాగితే, భవిష్యత్తులో ఈ విధమైన సేవా కార్యక్రమాలపై నమ్మకం పోతుందని, సమాజంలో ఉదారత ప్రేరణకు అవరోధంగా మారతుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
21.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## అది కాళేశ్వరం కమిషన్ కాదు. కాంగ్రెస్ కమిషన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ప్రజానాయకుడు కేసీఆర్‌కు రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు... కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైంది అని విమర్శించారు.కాళేశ్వరం ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు. తెలంగాణ ప్రజల తరతరాల దాహార్తిని తీర్చడానికి, తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను గళగళా తరలించడానికి కట్టిన ప్రాజెక్టు. తాను కలలు గన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరం. రాజకీయ కక్షతో, కుట్రతో ఇచ్చిన ఈ నోటీసులు, వేసిన కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్ని గెలిపిస్తాయి. నిజాలన్నీ బయటకు వస్తాయని, రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు



# భూసమస్య పరిష్కారం దిశగా అడుగులు

- **ఖాల్సా సర్వే నెం.1146 కు మోక్షం**
- **ఏండ్ల తరబడి నిరీక్షణకు తెర**
- **ఉప్పరిగూడ, శేరిగూడ గ్రామాల రైతులకు త్వరలో కొత్త పాస్ పుస్తకాలు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :** యేండ్ల తరబడి నిరీక్షించిన బాధిత రైతులఎట్టకేలకు మోక్షం లభించనుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఇబ్రహీంపట్నం ఖాల్సా సర్వే నంబర్ 1,146 లోని అసైన్డ్ భూమిలో, గతంలో భూమి ఉన్నదాని కంటే ఎక్కువ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సర్వే నంబర్ మొత్తం విస్తీర్ణం 138.04 ఎకరాలు. కానీ కాలక్రమేనూ 165.05 ఎకరాలకు గాను రైతులకు ధ్రువ పత్రాలను అందజేసింది. అంటే అదనంగా 27.03 ఎకరాలకు పత్రాలు అదనంగా ఇచ్చారు. సుమారు 120 మందికి పైగా ఉన్న రైతులకు ధరణి వచ్చాక ఈ ల్యాండ్ ఎక్సెస్ కారణం చూపుతూ ధరణి కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీంతో గత ప్రభుత్వంలో ఆయా రైతులు రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలను కోల్పోయారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసు కొచ్చిన భూభారతిలో ఈ ఎక్సెస్ ల్యాండ్ సమస్య పరిష్కరించే దిశగా కార్యచరణ మొదలయ్యింది. త్వరలోనే ఈ భూ సమస్య పరిష్కరించి రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు..

# జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసిన మధుయాష్కీ గౌడ్

- **నియోజకవర్గంలో 40 కాలనీలలో చేపట్టాల్సిన డ్రైనేజీ లైన్ల ఏర్పాటు పై చర్చ**
- **ప్రస్తుతం జరుగుతున్న ట్రంకులైన్, డ్రైనేజీ పనులు కూడా వేగంగా పూర్తి చేయాలని సూచన.**



**ఎల్బీనగర్ విశాల భారతి:** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఈరోజు జలమండలి ఎండి అశోక్ రెడ్డి ని ఖైరతాబాద్ లోని వారి కార్యాలయంలో కలిశారు. జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి , కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బానోతు సుజాత నాయక్ తో కలిసి ఎల్బీనగర్ నియోజకవర్గంలో డ్రైనేజీ, మంచినీటి సమస్యలను ఎండి అశోక్ రెడ్డి కి వివరించారు. పెరుగుతున్న కాలనీలు, జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో పలు కాలనీలకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దాదాపు 40 కాలనీలలో డ్రైనేజ్ పైపులైన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని ఆ వినతి పత్రంలో కోరారు. కొన్ని కాలనీలో పాతలైన్ల స్థానంలో కొత్తలైన్లు వేయాలని సూచించారు. మనసురాబాద్ డివిజన్ హయత్ నగర్ లోని స్వాతి రెసిడెన్సి నుంచి బాలాజీ నగర్ వరకు జరుగుతున్న ట్రంక్ లైన్ పనుల్లో జాప్యాన్ని ఎండి దృష్టికి తీసుకెళ్లి. వేగంగా పనులు పూర్తి చేయించాలని సూచించారు. బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ బృందావన్ మిడోస్ కాలనీ డ్రైనేజీ పనులు కూడా తొందరగా పూర్తి చేయించాలని కోరారు. అంతేకాకుండా బియన్ రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్ నగర్ సమీపంలోని 21 కాలనీలకు డ్రైనేజీ ట్రంక్ లైన్ వ్యవస్థ లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి డ్రైనేజీ సదుపాయం కల్పించేందుకు ట్రంక్ లైన్ ఏర్పాటు కు చర్యలు చేపట్టాలని సూచించారు. సరూర్నగర్ చెరువు వద్ద ఎస్టీపీ నిర్మాణం చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండి ఆయా పనులకు దశలవారీగా నిధులు మంజూరు చేసి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి , వజ్రేష్ యాదవ్ , కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి , స్వర్ణరాజ్ శివమణి తదితరులు పాల్గొన్నారు.



# మంచినీటి పైప్ లైన్ పనులను ప్రారంభం

- **కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:** హయత్ నగర్ డివిజన్లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో మంగళవారం ఉదయం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో కలిసి నూతన మంచి నిట్టి పైప్ లైన్ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేయడం తన యొక్క బాధ్యతని, దాదాపు గత నాలుగున్నర సంవత్సరాలుగా హయత్ నగర్ డివిజన్ ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయడం జరిగిందని రానున్న రోజుల్లో కూడా ప్రతి నిత్యం హయత్ నగర్ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధి చేయడం తన యొక్క లక్ష్యం అని కార్పొరేటర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సూర్య నాయక్ , కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నరసింహ చారి , చంద్రశేఖర్ రెడ్డి , రమేష్ , అజ్జు , మూర్తి , నర్సింగ్ , నారాయణ , వెంకటేష్, సాయి కృష్ణతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- **బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి**
- **బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ సమావేశం**

**కూకట్ పల్లి,విశాలభారతి:** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా, బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో మంగళవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు, ఈ సమావేశానికి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లిం సమాజానికి చెందిన నాయకులు, మత పెద్దలను హాజరయ్యారు. బాలానగర్ ఎసిపి నరేష్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశం డిఐ, ఎస్ఐలు ఇతర అధికారులతో కలిసి శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా వేడుకలు జరుపుకునేలా చూడటం లక్ష్యంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో పండుగల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, ప్రశాంతమైన వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని కోరారు. పండుగ కోసం "చేయవలసినవి చేయకూడనివి" విషయాలపై ముస్లిం సోదరులకు ఆయన మార్గదర్శకత్వం చేశారు. జంతువుల వ్యర్థాలను మునిసిపల్ సిబ్బంది అందిచ్చిన సంచులలో మాత్రమే పారవేయాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయడం పొరుగు ప్రాంతాలలో నీరు నిలిచిపోకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి పుకార్లను పట్టించుకోవద్దని ఏసీపీ రెడ్డి శాంతి కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇతర మతాల ప్రజల మనోభావాలను గౌరవించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పుకార్ల వ్యాప్తిని ఎదుర్కోవడానికి సోషల్ మీడియాలో కఠినమైన నిఘా ఉంచుతామని, సామాజిక వ్యతిరేక శక్తులు, అశాంతిని రెచ్చగొట్టడానికి ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. సమావేశంలో డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు హాజీమియా, సరితా రెడ్డి, సరళ, వెంకటేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# నీరు పేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

- **రంగారెడ్డి జిల్లా ప్రజావాణి అధికారి వినతి**
- **గౌరెల్లి గ్రామ దళిత యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గ్రామ ప్రజలు**

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం గౌరెల్లి గ్రామంలో ఉన్నటువంటి ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రంగారెడ్డి జిల్లా ప్రజా వాణి అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపిన గౌరెల్లి దళిత యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గ్యార నరసింహ తెలిపారు, ఈ సందర్భంగా గ్యార నరసింహ మాట్లాడుతూ గౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ సర్వే నెంబర్ 238 లో సుమారు 84 ఎకరాల పైచిలుకు విస్తీర్ణం కలిగిన భూమి ఉన్నదని అన్నారు, ఈ భూమిని సుమారు ఎకరాల 26. 27 గుంటల భూమిని వ్యవసాయం కొరకు లావాణి పట్టాలు ఇవ్వగా వ్యవసాయానికి అక్కరకు రాని భూమి రాళ్లు రప్పలు, బండలు ఉన్నటువంటి సుమారు ఎకరాల 57.13 గుంటల భూమి విస్తీర్ణంలో మిగిలి ఉన్న భూమిని మొత్తం సర్వే చేయించి ఇల్లు లేని నిరు పేదలైనటువంటి ప్రజలకు ప్రతి ఒక్కరికి 120 చదరపు గజాల స్థలాన్ని కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని కోరడం జరిగిందని అన్నారు, కాబట్టి కలెక్టర్ ఈ విషయాన్ని పూర్తిగా పరిశీలించి నిరుపేదలైన ప్రజలకు సర్వేనెంబర్ 238 లో ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రతి ఒక్కరికి 120 చదరపు గజాల చొప్పున ఇంటి స్థలం ఇచ్చి పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు ఇంటి నిర్మాణం కొరకు ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు మంజూరు చేయించి పేద ప్రజల మైన మాకు తగిన న్యాయం చేయాలని కోరడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో దళిత యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గ్యార నరసింహ, గౌరెల్లి గ్రామ దళిత యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చిన్న సిపిఐ అభివృద్ధి కోసం కృషి చేశాడు

- **మారేడు చిన్న వర్ధంతి**
- **సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి**

**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా,అబ్దుల్లాపూర్మెట్ మండల ప్రజానాట్యమండలి మాజీ ప్రధాన కార్యదర్శి మారేడు చిన్న 4వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేసిన ప్రజానాట్యమండలి మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మారేడు చిన్న వర్ధంతి సందర్భంగా తన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, జిల్లా నాయకులు మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హజ్మీర హరి సింగ్ నాయక్, కేతురాజు నరసింహ,దాసరి ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు ప్రజానాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు






# వీ హబ్ తో గీతం అవగాహనా ఒప్పందం

**పటాన్ చెరు,విశాలభారతి** తెలంగాణ ప్రభుత్వం మహిళా వ్యవస్థాపకుల కోసం నెలకొల్పిన వీ హబ్ (WE HUB) తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాయం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ర్యాంప్ (RAMP సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల పనితీరును పెంచి, వాటిని వేగవంతం చేయడం) చొరవను ఘనంగా ప్రారంభించిన సందర్భంగా ఈ అవగాహన కుదరడం విశేషం. ఈ సహకారం మహిళలు నడిపే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈలు) ముందుకు తీసుకెళ్లడంలో, ఈ ప్రాంతం అంతటా వారి వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక కీలకమైన ముందడుగును సూచిస్తోంది. మహిళా వ్యవస్థాపకులకు వారి వెంచర్లను వృద్ధి చేసుకోవడానికి అవసరమైన వనరులు, మార్గదర్శనం, అందుకు అనుగుణమైన వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్ కింద ఈ భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ యొక్క ఆవిష్కరణ, వ్యవస్థాపక కేంద్రమైన వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ (వీడీసీ) దీనిని నిర్వహించనున్నది. ఈ అవగాహనా ఒప్పందంపై గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్యకృతి గుప్తా, వీ హబ్ డైరెక్టర్ (సామాజిక ప్రభావం, వ్యవస్థాపకత) జాహిద్ అఖ్తర్ షేక్ లు సంతకాలు చేశారు. వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ ఫక్రుద్దీన్ షేక్ ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంలో కీలక కార్యాచరణ పోషించడమే గాక, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలను పెంపొందించడంలో గీతం చురుకైన పాత్రను పునరుద్ఘాటిస్తారు. ఈ కార్యక్రమంలో వీ హబ్ సీఈవో పి.సీత, వీడీసీ కోచ్ లు, ఈక్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విభాగాధిపతులు, బీబీఏ విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీ హబ్, తెలంగాణ ప్రభుత్వంతో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం విద్య, వ్యవస్థాపకత, సహకారం ద్వారా సమ్మిళిత, వినూత్న, స్థిరమైన వృద్ధిని పెంపొందించడంలో గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.



# సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

**నాచారం,విశాలభారతి:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కె ఎల్ రెడ్డి నగర్ కాలనీలో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి 65 లక్షల రూపాయలతో కాలనీ అంతర్గత సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ రామారావు, నాయకులు తండా వాసుగౌడ్, ప్రవీణ్, దయాకర్ రెడ్డి, సనాల రవి, శీలం ప్రవీణ్, రాపోలు శ్రీనివాస్ స్థానిక కాలనీ వాసులు మహేందర్ రెడ్డి, యాకుబ్ రెడ్డి, శశిధర్ రాజు, రాజేష్ పాల్గొన్నారు



## రకుల్ రిటైర్మెంట్ తీసుకోదంట!

రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కెరీర్ అనంతరం అమ్మడు బాలీవుడ్ టార్గెట్ గా సినిమాలు చేస్తోంది. మధ్యలో కోలీవుడ్ లో అవకాశాలు వస్తే అక్కడా సినిమాలు చేస్తోం ది. ఇప్పటికే అమ్మడి కెరీర్ ప్రారంభమై 15 ఏళ్లకు పైగా పూర్తయింది. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీ ని ప్రేమించి వివాహం చేసుకుంది. అయినా సినిమాలకు మాత్రం నోబ్రేక్ అంటూ కంటున్యూ అవుతుంది. కెరీర్ పరంగా భర్త నుంచి పూర్తి సహకారం ఉండటంతోనే సంతోషంగా కొనసాగుతుంది. ఏ నటికైనా ఏదో ఒక దశలో రిటైర్మెంట్ తప్పదు. కానీ రకుల్ డిక్షనరీలో మాత్రం ఎలాంటి రిటైర్మెంట్ లేదంటోంది. జీవి తాంతం సినిమాలు చేస్తూనే ఉంటానని తెలిపింది. సినిమాల నుంచి ఏ దశలోనే రిటైర్మెంట్ తీసుకోనని అంటోంది. వయసు అనేది కేవలం నెంబర్ మాత్రమేనని...దాన్ని చూసి పనిచేయడం తగ్గించుకోవాలి అనే దాన్నినమ్మనంటోంది. `ఇండస్ట్రీకి చాలా ఆశలతో వచ్చాను. సినిమా ప్రారంభించిన కొత్తలో కొన్నేళ్లు మాత్రమే ఒక అమ్మాయి హీరోయిన్ గా రాణించగలదని అన్నారు కొందరు. కానీ ఇప్పడా పరిస్థితులు మారుతున్నాయి. అద్భుతంగా పని చేసినన్ని రోజులు వయసుతో సంబంధం లేకుండా పరిశ్రమలో రాణించే అవకాశం ఉంటుంది` అని తెలిపింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ 34 ఏళ్లు. ఇండస్ట్రీలో ఇంకా చాలా కెరీర్ ఉంది. 2009లో గల్లి అనే కన్నడ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. రెండేళ్లకు `కెరటం` అనే తెలుగు సినిమాలో నటించింది. ఏడాది గ్యాప్లో తమిళ్ లోనూ లాంచ్ అయింది. అక్కడ రెండు..మూడు సినిమాలుచేసిన అనంతరం `వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ `సినిమాలో ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో రకుల్ నటిగా బిజీ అయింది.



## రుక్మిణికి మరో క్రేజీ ఆఫర్?

సప్త సాగారాలుదాచే ఎల్లో సెడ్ ఎ మరియు సైడ్ బి సినిమాలతో మంచి నటిగా పేరు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ ఇప్పడు సినీ ఇండస్ట్రీలో ఓ తుఫానులా దూసుకెళ్తుంది. ఆ సినిమాలు చూశాక రుక్మిణిని ఇండియన్ సినిమా మొత్తం తమ సినిమాల కోసం లాక్ చేసుకోవాలని చూస్తోంది. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్31 కోసం రుక్మిణి ఎంపికైందని సమాచారం. దీంతో పాటూ తమిళ సినిమాలు ఏస్, మదరాసిలో కూడా రుక్మిణి నటిస్తోంది. ఇదిలా ఉంటే రుక్మిణి ఇప్పడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులో భాగమైనట్టు తెలుస్తోంది. థగ్ లైఫ్ సినిమా తర్వాత మణిరత్నం ఓ రొమాంటిక్ ఎంటర్టైనర్ ను చేయాలని ప్లాన్ చేసుకున్నాడట. అందులో హీరోగా నవీన్ పోలిశెట్టిని అనుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు కానీ ఆ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఎంపికైందని వార్తలొస్తున్నాయి. ఇదే నిజమైతే ప్రశాంత్ నీల్ డ్రాగన్ మూవీ షూటింగ్ టైమ్ లో రుక్మిణి కొత్త సినిమా ఒప్పకోకూడదనే రూల్ ను తీసేయాల్సి వస్తుంది. మణిరత్నం సీన్ లోకి వస్తే ఎవరైనా రూల్స్ ను మార్చుకోవాల్సిందేనని ఈ విషయం తెలియచేస్తుంది. ఒకవేళ నిజంగా రుక్మిణి మణిరత్నం సినిమాలో నటించడం ఓకే అయితే, నీల్ తన రూల్ బుక్ ను దీని కోసం మినహాయించాల్సి వస్తుంది. అంతేకాదు ఈ వార్త నిజమైతే రుక్మిణి ఇద్దరు మోస్ట్ పవర్‌ఫుల్ డైరెక్టర్లైన మణి రత్నం మరియు నీల్ తో ఒకేసారి సినిమా చేసే ఛాన్స్ దక్కించుకున్నదవుతుంది. అయితే ఇంకా దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కన్నడ భాషతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రుక్మిణి ఇప్పడు పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేసే స్థాయికి ఎదిగింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.